క్లుప్తంగా

24న మునీశ్వరాలయ కుంభాభిషేకం


మునీశ్వర స్వామివారు

పుంగనూరు : మండలంలోని కురవూరులో ఉన్న పచ్చపల వంక శ్రీజయమునీశ్వరస్వామి ఆలయ మహాకుంభాభిషేకాన్ని ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఆలయం నిర్మించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నవగ్రహ, మహామృత్యుంజయ, శాంతి హోమాలను జరిపించనున్నట్లు వెల్లడించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

విరూపాక్షి మారెమ్మకు పూజలు

పుంగనూరు : పట్టణంలోని విరూపాక్షి మారెమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేకంగా రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్


మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాస్

రొంపిచెర్ల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం మండలంలోని 22మంది రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్‌ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ ఘర్షణలకు పాల్పడినా, వేరే కేసులు నమోదైనా నాన్‌బెయిలబుల్ సెక్షన్లు నమోదు చేస్తామని హెచ్చరించారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు.

పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫామ్


యూనిఫామ్ పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఇబ్రహీంఖాన్

రొంపిచెర్ల: పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు సర్పంచ్ ఇబ్రహీంఖాన్ శుక్రవారం యూనిఫామ్ పంపిణీ చేశారు. మొత్తం 22 మంది కార్మికులకు రెండు జతల దుస్తులు, ఆయిల్, సోపులు అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని కోరారు. క్రమం తప్పకుండా వీధులలో చెత్తా చెదారాలను తొలగించాలని సూచించారు. ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సీరాజున్నీసా, పంచాయతీ కార్యదర్శి నాగరాజా, వార్డు మెంబర్లు లక్ష్మయ్య, చిన్న నాగరాజా, మస్తాన్, వైఎస్సార్‌సీపీ స్థానిక నేత కరీముల్లా పాల్గొన్నారు.

కమనీయం.. కల్యాణం

సోమల: స్వయేంబేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి కమనీయంగా ఆదిదంపతుల కల్యాణం నిర్వహించారు. శివపార్వతుల ఉత్సవర్లకు ప్రత్యేక పూజలు చేసి ఆలయం ఎదుట నిర్మించిన వేదికపై కొలువుదీర్చారు. శాస్త్రోక్తంగా వేదపండితులు కల్యాణ ఘట్టం జరిపించారు. అనంతరం పల్లకిపై ఆశీనులైన స్వామి, అమ్మవార్లకు వైభవంగా గ్రామోత్సవం చేశారు.

చలివేంద్రాలు ప్రారంభం

పలమనేరు : మండలంలోని పలు పంచాయతీల్లో కలెక్టర్ ఆదేశాల మేరకు చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఈఓపీఆర్డీ గిరిధర్ తెలిపారు. శుక్రవారం ముడివారిపల్లె బస్‌స్టాప్ వద్ద సర్పంచ్ చెంగమ్మ, స్థానిక నేత జగన్‌మోహన్ రెడ్డి, టి.వడ్డూరులో సర్పంచ్ మునస్వామి చేతులమీదుగా చలివేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీ సభ్యులు నాగరత్న విజయ కుమార్, పంచాయతీ కార్యదర్శి విజయ పాల్గొన్నారు.

కీలపట్లలో వైద్య శిబిరం

గంగవరం : మండలంలోని మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాల వారి ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు ఆధ్వర్యంలో శుక్రవారం కీలపట్ల గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యం

గుడుపల్లె : క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా పీఈఎస్ ఆస్పత్రి పనిచేస్తోందని ప్రిన్సిపల్ కృష్ణారావు తెలిపారు. శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని ఆస్పత్రుల్లో టీబీ చికిత్సకు మందులు అందుబాటులో ఉంటాయన్నారు. సూపరింటెండెంట్ చెన్న బసవపాటిల్, ర్యాలీ సుబ్బారావు, విశ్వేశ్వరరెడ్డి, మెహన్‌రూప పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో కంచె దగ్ధం

పుంగనూరు : పట్టణ సమీపంలోని అరబిక్ కళాశాల వద్ద శుక్రవారం సంభవించిన అగ్నిప్రమాదంలో కంచె దగ్ధమైంది. ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు.

సారా విక్రేత అరెస్ట్

సదుం: మండలంలోని గంటావారిపల్లెలో సారా విక్రయిస్తున్న సుబ్రమణ్యం అనే వ్యక్తిని పులిచెర్ల ఎస్‌ఈబీ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 4లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. దాడిలో ఎస్‌ఐ కవీశ్వర్‌నాయుడు, హెచ్‌సీ సుధాకర పాల్గొన్నారు.


గడ్డూరులో లబ్ధిదారుకు సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ


నూలుకుంట పంచాయతీలో లబ్ధిదారుకు సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్సీ భరత్

పేదల అభ్యున్నతికే నవరత్నాలు

- పారదర్శకంగా పథకాల అమలు
- అర్హులందరికీ సంక్షేమం
- ప్రజా సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎమ్మెల్సీ భరత్

బైరెడ్డిపల్లె : పేదల అభ్యున్నతికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. శుక్రవారం మండలంలోని గడ్డూరు, ఎం.కొత్తూరు, కోట్రేపల్లెలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. దాదాపు 660 ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పథకాల చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. ముఖ్యంగా మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. అవినీతికి తావులేకుండా, పార్టీలతో ప్రమేయం లేకుండా, కులమతాలకు అతీతంగా, అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు దళితులు, మహిళల అభ్యున్నతికి చేసింది శూన్యమన్నారు. ఇప్పుడు అండగా ఉంటామంటే ఆయనను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. దళితులుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని చంద్రబాబు అంటే ఆయన కుమారుడు మరింత అవమానకరంగా దళితులను కించపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. మహనీయులు అంబేద్కర్ జయంతి రోజునే దళితులను హేళన చేసిన లోకేష్‌కు ఓటు అడిగే నైతిక అర్హత లేదని మండిపడ్డారు. చంద్రబాబుతోపాటు టీడీపీ నేతలందరికీ దళితులను అవమానించడమే లక్ష్యమని విమర్శించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలను ఓటు బ్యాంకుగానే చూశారని ఆరోపించారు. ప్రజలకు ఎప్పుడూ బురిడీ కొట్టించే బాబుకు 2019లో అడ్రస్ గల్లంతైందని, రాబోయే ఎన్నికల్లో సైతం అవే ఫలితాలు పునరావృతమవుతాయని స్పష్టం చేశారు. ఎన్నికలు సమీపిస్తే చంద్రబాబుకు వెంటనే ఎన్టీఆర్ గుర్తుకు వస్తారని, అధికారంలో ఉన్నప్పుడు మాత్రం ఆ ఊసే ఉండదని ఆరోపించారు. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓ జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టి హుందాతనం చాటుకున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దయానందగౌడ్, వైస్ ఎంపీపీలు నారాయణస్వామి, రూప, సర్పంచులు దేవేంద్రగౌడ్, చంద్రమౌళి, వెంకటేష్, బాలకృష్ణగౌడ్, రాజప్ప, రవిచంద్ర ఎంపీటీసీ సభ్యులు వినాయకం, నాగరాజు, రవీంద్రమ్మ, సచివాలయ మండల కన్వీనర్ కార్తీక్ పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సేవలు

కుప్పంరూరల్ : ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలను అందిస్తున్నామని ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. శుక్రవారం మండలంలోని నూలుకుంట, కుట్టిగానిపల్లె, ఎస్సీ కాలనీ, రామ్‌నగర్‌లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. సుమారు 268 ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాల మేరకు సంక్షేమ పథకాలు అందేవని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు సంక్షేమ ఫలాలు వెతుక్కుంటూ ఇంటికే వస్తున్నాయని వెల్లడించారు. ఇటు అభివృద్ధి.. అటు సంక్షేమ సమపాళ్లలో అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. గతంలో నియోజకవర్గ వ్యాప్తంగా కేవలం 600 ఇళ్లు మాత్రమే పేదలకు కేటాయించారని, ప్రస్తుతం దాదాపు 4వేల ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు పంపిణీ చేశామని వివరించారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని, అందుకే ఈ నెల 25వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని పొడిగిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం నూలుకుంటలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శరవణ, సర్పంచ్ కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు రామచంద్ర, నాయకులు తిమ్మోజీగౌడ్, మురుగేష్, ఈశ్వర్, గుడుపల్లె రవి పాల్గొన్నారు.

కుప్పానికి బాబు చేసింది శూన్యం


విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పంరూరల్ : దశాబ్దాలుగా మోసిన కుప్పం నియోజకవర్గానికి చంద్రబాబు చేసింది శూన్యమని ఎమ్మెల్సీ భరత్ విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసినా శాశ్వత ఉపాధి, తాగు, సాగునీటి పథకాలు చేపట్టలేకపోయారని ఆరోపించారు. కుప్పంలో కియా మోటార్స్ నెలకొల్పి ఉంటే పదివేల మంది యువత నిత్యం బెంగళూరుకు వెళ్లాల్సిన దుస్థితి తప్పేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన హయాంలో కనీసం డిగ్రీ కళాశాలకు ఏర్పాటు చేయలేకపోయారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అప్పట్లో పాలారు ప్రాజెక్టుకు టెండర్లు పిలిస్తే, తమిళ పార్టీలతో కుమ్మక్కై అడ్డుకున్నారని మండిపడ్డారు. చంద్రబాబుకు దమ్ముంటే కుప్పం నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా తెలుసుకోవాలని, అందలేదంటే రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటామని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సాయంతో రూ.500 కోట్లు వెచ్చించి రెండు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు నిర్మిస్తున్నామన్నారు. కుప్పం మున్సిపాలిటీకి రూ.66 కోట్లు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రూ.100 కోట్లు సాధించుకున్నామని వివరించారు. ఈ క్రమంలో డీకేపల్లె మదర్సాలకు 2.19 ఎకరాలను కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. అదీ పట్టణంలోని 8వ వార్డులో అందిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సుధీర్, వైస్ చైర్మన్ హఫీజ్, నేతలు సర్దార్, అబ్బాస్, నాసీర్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

సమానత్వానికి ప్రతీక రంజాన్


ఈద్గా మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తదితరులు


రంజాన్ కానుక అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్


రంజాన్ కానుకను పంపిణీ చేస్తున్న జాఫర్

పుంగనూరు : సర్వమత సమానత్వానికి రంజాన్ ప్రతీకని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎన్‌ఎస్ పేట ఈద్గా మైదానంలో రంజాన్ ప్రార్థనకు చేపట్టిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అమ్ము , సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జి ఫక్రుద్దీన్‌షరీఫ్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు ఎంఎస్ సలీం, ఇబ్రహీం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

కానుక పంపిణీ

రామకుప్పం: రంజాన్ సందర్భంగా స్థానిక సర్పంచ్ మురళీకృష్ణ సుమారు 500 మంది ముస్లిం కుటుంబాలకు ఎమ్మెల్సీ భరత్ చేతుల మీదుగా కానుక పంపిణీ చేసారు. అనంతరం స్థానిక జామియా మసీదులో నేతలతో కలసి ఎమ్మెల్సీ భరత్ ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, మాజీ ఎంపీపీ ఆరేళ్ల జయప్ప, పార్టీ మండల కో- కన్వీనర్ చంద్రారెడ్డి ఉన్నారు.

కుప్పంలో..,

కుప్పం : బీసీఎన్ విద్యా సంస్థల అధినేత నాగరాజు, బీసీఎన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శాంతానాగరాజు ఆధ్వర్యంలో 150 మంది ముస్లింలకు రంజాన్ కానుక అందజేశారు.

పలమనేరులో..

పలమనేరు : వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జాఫర్ సుమారు 2,500 ముస్లిం కుటుంబాలకు 12రకాల సరుకులతో కూడిన రంజాన్ కానుకను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ రంజాన్‌ను సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

ఇఫ్తార్ విందు

రొంపిచెర్ల: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె, రొంపిచెర్ల పంచాయతీల్లో ముస్లింలకు వైఎస్సార్‌సీపీ మండల బీసీ సెల్ అధ్యక్షుడు కోటా వెంకటరమణ, సర్పంచ్ ఇబ్రహీంఖాన్ శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఫజులుపేట అక్సా మసీదులో వైఎస్సార్‌సీపీ నాయకులు కోటా వెంకటరమణ ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సైపూల్లాఖాన్, విజయశేఖర్, నాగరాజా, కమలాకర్ రెడ్డి, అశోక్‌కుమార్ రెడ్డి, ఇజాజ్, రఫీ, మస్తాన్, లీం, పెద్దపులి ముబారక్, వాజిద్, హబీబ్, ముజీబ్, కరీముల్లా, లక్ష్మయ్య, చిన్న నాగరాజా పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే 'సంక్షేమం'


సదుం: కంభంవారిపల్లెలో ఇంటింటా ప్రచారం

సదుం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే పేదలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ నేతలు కొనియాడారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరుతున్న లబ్ధిని వివరించారు. జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లను లబ్ధిదారుల అనుమతితో ఇళ్లకు అంటించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, హరినాథరెడ్డి ల్గొన్నారు.

వి.కోటలో..

వి.కోట: మండలంలోని చింతమాకులపల్లె పంచాయతీలో సర్పంచ్ రామచంద్రప్ప ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. జగనన్న పాలనపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. వారి అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ఇళ్లకు అంటించారు.

జగనన్న కాలనీకి స్థల పరిశీలన

సోమల: మండలంలోని కందూరులో జగనన్న కాలనీ ఏర్పాటునకు అధికారులు, స్థానిక నేతలు శుక్రవారం స్థల పరిశీలన చేపట్టారు. తహసీల్దార్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికే కందూరులో జగనన్న కాలనీ పేరిట ఇంటి పట్టాలు మంజూరు చేశామన్నారు. మరింతమంది పేదలు స్థలాల పంపిణీకి దరఖాస్తు చేసుకోవడంతో రెండో కాలనీ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీటీ ప్రకాష్‌బాబు, సర్పంచ్ మసూద్, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ సభ్యుడికి పరామర్శ


కేశవులు పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు : రోడ్డు ప్రమాదంలో గాయపడి చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న బైరెడ్డిపల్లె జెడ్పీటీసీ సభ్యుడు ఆర్.కేశవులును శుక్రవారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పలమనేరు ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ మాజీ కన్వీనర్ మండీ సుధా చీలాపల్లెకు వెళ్లి కేశవులు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

మే 13న జాతీయ లోక్ అదాలత్

పలమనేరు : పట్టణంలోని ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో మే 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక కోర్టు వద్ద ఆయన మాట్లాడుతూ కక్షిదారులు అనవసరమైన పంతాలకు పోకుండా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని కేసులను రాజీ చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం పలువురు న్యాయవాదులతో ప్రత్యేక కమిటీలను కూడా ఏర్పాటు చేశామని వెల్లడించారు.

పండ్ల తోటల పెంపకంలో 'ఉపాధి'

సోమల: ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకానికి తొలి ప్రాధాన్యమిస్తున్నట్లు ఏపీఓ దినకర్‌బాబు తెలిపారు. శుక్రవారం రోజ్ గార్ దివస్ సందర్భంగా పెద్ద ఉప్పరపల్లె, ఆవులపల్లె, కొత్తూరులో గ్రామ సభలు నిర్వహించి ఉపాధి పథకంపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డులో మార్పులు చేర్పులతో పాటు, కొత్తగా కార్డు తీసుకునే వెసులుబాటు ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన వారు జాబ్‌కార్డు పొందేందుకు అర్హులని వెల్లడించారు.

ఉద్యాన పంటల పరిశీలన

వి.కోట : మండలంలోని బైరుపల్లె, మద్దిమాకులపల్లె, నడమంత్రం గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న టమాట, చీనీ, నిమ్మతోటలను శాస్త్రవేత్త శ్రీనివాసులు శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో పంటలను ఆకుముడత తెగులు, రసం పీల్చే పురుగు ఆశించకుండా నివారణకు అసిపేట్ 1.5 గ్రాములు, లీటరు నీటికి లేదా అసిటామిప్రిడ్ 0.3గ్రా/ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే ఆకు మాడు తెగులు నివారణకు సైమోక్సానిల్+ మాంకోజెబ్ 2గ్రా/లీ, డైమితోమార్ఫ్ + మెటిరామ్ 1-2 గ్రా/లీ పిచికారిఈ చేయాలని సూచించారు. టమాట పంటకు డ్రిప్పుల ద్వారా నీటి తడుపులు ఇవ్వాలని తెలిపారు. మండల ఉద్యానశాఖ అధికారి లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

25న సామాజిక తనిఖీ

పుంగనూరు : పట్టణంలోని పీఆర్ బంగ్లాలో ఈనెల 25వ తేదీన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేశ్వరి శుక్రవారం తెలిపారు. ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన సభ జరుగనున్నట్లు వెల్లడించారు.

చిరుధాన్య ఆహారంతో ఆరోగ్యం

గుడుపల్లె : చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని ఎంపీపీ వరలక్ష్మి తెలిపారు. శుక్రవారం శెట్టిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో చిరుధాన్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ తక్కువ నీటితోనే చిరుధాన్య పంటలను సాగు చేయవచ్చన్నారు. ఏఓ నాగరాజు పాల్గొన్నారు.

మాటలు.. మంటలు

- భగ్గుమన్న దళితలోకం
- లోకేష్ వ్యాఖ్యలపై వెల్లువెత్తిన నిరసన
- నల్లబ్యాడ్జీలతో ఆందోళన

చౌడేపల్లె : దళితులను కించపరిచేలా నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలపై నిరసనలు వెల్లువెత్తాయి. శుక్రవారం పలు ప్రాంతాల్లో దళిత నేతలు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళనకు దిగారు. చౌడేపల్లెలో దృశ్యకళల రాష్ట్ర డైరెక్టర్ అంజిబాబు మాట్లాడు తూ ఎస్సీల్లో పుట్టాలని ఎవరూ కోరుకోరు అని చంద్రబాబు గతంలో మాట్లాడితే, ఇప్పుడు ఆయన బాటలోనే లోకేష్ కూడా దళితులను హేళన చేయడం దారుణమని మండిపడ్డారు. విదేశీ విద్య పేరిట గత టీడీపీ ప్రభుత్వంలో రూ. కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళితులకు సముచిత స్థానం కల్పించారని తెలిపారు. మంత్రి పదవుల్లోనూ అగ్రపీఠం వేశారన్నారు. అనంతరం బస్టాండ్ వద్ద లోకేష్ దిష్టిబొమ్మను దహనం చేశారు. క్షమాపణ చెప్పకుంటే తగిన బుద్ధి చెబుతామని, యువగళం పాదయాత్రను సైతం అడ్డుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దామోదర రాజు, ఎంపీపీ రామమూర్తి, సచివాలయ మండల కన్వీనర్ రుక్మిణమ్మ, బోయకొండ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శంకర్ నారాయణ, మాజీ సభ్యుడు శంకరప్ప, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కల్యాణ్‌భరత్, ఎంపీటీసీ సభ్యుడు శ్రీరాములు, సర్పంచ్‌లు భాగ్యవతి, లక్ష్మీదేవి, విజయ కుమారి, కదిరప్ప, రఘునాథరెడ్డి, దళిత సంఘం మండల అధ్యక్షుడు బ్యాంకు రెడ్డెప్ప, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సుబ్రమణ్యం, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు గోవిందయ్య పాల్గొన్నారు.

సదుం: దళితులపై లోకేష్ వ్యాఖ్యలు అభ్యంతరకరమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి తెలిపారు. అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన దళిత సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో దళితులే టీడీపీ గుణపాఠం నేర్పుతారన్నారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. డప్పు కళాకారుల సంఘం నేత సీతాపతి, మాధవ, చౌడప్ప, రామాంజులు, ప్రభాకర, రమేష్, రాజేష్, మునిరామయ్య పాల్గొన్నారు.

పులిచెర్ల(కల్లూరు): నారా లోకేష్ వ్యాఖ్యలకు పులిచెర్ల ఎంపీడీఓ కార్యాలయం వద్ద పలువురు దళిత నేతలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కర్నూలు జిల్లా డోన్ నియోజకవర్గంలో నిర్వహించిన ఎస్సీలతో ముఖాముఖి కార్యక్రమంలో లోకేష్ మాట్లాడుతూ దళితులు పీకిందేమీ లేదని అసభ్యంగా దూషించడం దారుణమని మండిపడ్డారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సంతోష్, కృష్ణయ్య, మునిరత్నం, శ్రీనివాసులు, రాజేష్, జేడీ నారాయణ, శంకరయ్య, శివ, శేషాద్రి, రామచంద్రయ్య, కిరణ్, సురేంద్ర, వెంకటరమణ పాల్గొన్నారు.

రొంపిచెర్ల: లోకేష్ వ్యాఖ్యలపై దళిత నేతలు నిరసన తెలిపారు. బండపల్లె సుభాష్ మాట్లాడుతూ దళితులకు టీడీపీ చేసింది శూన్యమన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు రైతు రుణమాఫీ అంటూ మోసం చేశారని విమర్శించారు. పసుపు.. కుంకుమ కింద పొదుపు మహిళలకు రూ.10 వేలు ఇస్తామని, రూ.6వేలు మాత్రమే ఖాతాల్లో వేశారని ఆరోపించారు. ఎన్నికల హామీల్లో 98శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. లోకేష్ వ్యాఖ్యలతో దళితులను ఓట్లు అడిగే అర్హతను టీడీపీ కోల్పోయిందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకులు నాగరాజా, రమణయ్య, ఓబులేసు, మల్లేపల్లె మీనాక్షి , రత్నకిషోర్, కృష్ణయ్య, రమణ , రాజయ్య, చిరంజీవి, చంద్ర పాల్గొన్నారు.

సోమల: యువగళం పాదయాత్రలో దళితులను అవమానిస్తూ లోకేష్ చేసిన వ్యాఖ్యలపై స్థానిక బస్టాండు వద్ద దళిత నేతలు, ప్రజాప్రతినిధులు ఆందోళనకు దిగారు. ఎంపీపీ ఈశ్వరయ్య మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నుంచి చినబాబు వరకు ఎప్పుడూ దళితులను చిన్నచూపే చూశారని మండిపడ్డారు. అనంతరం లోకేష్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రమణయ్య, మాజీ సర్పంచ్ శ్రీరాములు, ఎంఆర్పీఎస్ నేత మందా రామనాథం, వాటర్‌షెడ్ వైస్ చైర్మన్ పీఎల్ఆర్ రాజారెడ్డి, రాజశేఖర్, విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటరమణ, విష్ణు పాల్గొన్నారు.


చౌడేపల్లె : లోకేష్ దిష్టి బొమ్మను ఊరేగిస్తున్న నేతలు


పులిచెర్లలో నిరసన తెలుపుతున్న దళిత నాయకులు


సోమల: లోకేష్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న దళిత నేతలు